
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

కృష్ణా జిల్లా వార్తలు

గురువారం 10 అక్టోబరు 2024



నేటి అలంకారం

శ్రీదుర్గాదేవి



బుధవారం తెల్లవారుజామున



మధ్యాహ్నం



రాత్రి



భక్తజనకీలాద్రి

ఇంద్రకీలాద్రికి పోటెత్తిన భక్తజనం

జనం జనం జనం.. కొండంత జనం క్యూ కట్టింది. క్యూలైన్లు.. ఆలయ పరిసరాలు.. రహదారులు ఎక్కడచూసినా వెల్లువలా కదిలింది. మూలా నక్షత్రం రోజున సరస్వతీదేవిగా దర్శనమిచ్చిన దుర్గమ్మను చూసేందుకు తండోపతండాలుగా తరలివచ్చింది. రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు కదలిరావడంతో ఇంద్రకీలాద్రి భక్తజనకీలాద్రిగా కనిపించింది. మంగళవారం అర్ధరాత్రి నుంచి బుధవారం అర్ధరాత్రి వరకూ రద్దీ కొనసాగింది. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహించడంతో దర్శనాలు సాఫీగా సాగాయి. వర్షాన్ని సైతం లెక్క చేయకుండా వచ్చిన భక్తులు దర్శనానంతరం అన్న ప్రసాదాన్ని స్వీకరించి తిరుగు పయనమయ్యారు. కుంకుమార్చనలు, అక్షరాభ్యాసాలు, సువాసినీ పూజలు, నగరోత్సవం, సాంస్కృతిక ప్రదర్శనలు ఉత్సవాలకు మరింత శోభను తీసుకొచ్చాయి.



క్యూలైన్లలో భక్తుల రద్దీ (ఇన్‌సెట్‌లో) సరస్వతీదేవిగా దుర్గమ్మ



సీఎం చంద్రబాబు కుటుంబానికి వేదాశీర్వచనం



డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కుమార్తెకు దుర్గమ్మ చీర ఇస్తున్న ఈవో

మూలా నక్షత్రం రోజు భారీగా రాక

- అన్ని క్యూలు ఉచితంగా అనుమతి
- అర్ధరాత్రి వరకూ తగ్గని రద్దీ
- సుమారు 2 లక్షల మంది వచ్చారని అంచనా
- దర్శనానికి మూడు గంటల సమయం
- దుర్గమ్మకు పట్టువస్త్రాలు సమర్పించిన సీఎం చంద్రబాబు కుటుంబం
- దుర్గమ్మ సేవలో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్



విజయవాడ/చిట్టినగర్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రికి భక్తులు పోటెత్తారు. మూలా నక్షత్రం రోజు సరస్వతీదేవి అలంకారంలో దర్శనమిచ్చిన అమ్మను చూసేందుకు రాష్ట్ర నలుమూలల నుంచి భారీగా తరలివచ్చారు. మంగళవారం అర్ధరాత్రి నుంచే క్యూలన్నీ భక్తులతో నిండిపోయాయి. దీంతో రాత్రి ఒంటిగంట తర్వాత దర్శనాలు మొదలుకావాల్సి ఉండగా, 12 గంటలకే ప్రారంభించారు. క్యూలన్నీ నిండిపోవడంతో పోలీసులు హోల్డింగ్ ఏరియాలను ఏర్పాటు చేశారు. పోలీసు కంట్రోల్ రూమ్ వద్ద ఉన్న ఫ్లైఓవర్‌పై వరకు హోల్డింగ్ ఏరియాలు ఏర్పాటు చేశారు. అన్ని క్యూలను ఉచితంగా వదిలేశారు. భక్తులకు ఒక లడ్డూను ఉచితంగా అందజేశారు. ఆలయం మూసివేసే సమయానికి సుమారు 1.50 లక్షల నుంచి 2 లక్షల మంది అమ్మవారిని దర్శించుకున్నారని అంచనా. గంటకు 6 వేల నుంచి 7 వేల మంది దర్శనానికి వచ్చినట్టు అధికారులు తెలిపారు. వినాయకుడి గుడి వద్ద క్యూలోకి వెళ్లిన భక్తులకు అమ్మవారి దర్శనం కావడానికి 3 గంటల సమయం పట్టింది. కాగా, దుర్గమ్మకు బుధవారం సీఎం చంద్రబాబు కుటుంబ సమేతంగా పట్టువస్త్రాలు సమర్పించారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, హోంమంత్రి అనిత, రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి, ఎంపీ కేశినేని చిన్ని, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు, పశ్చిమ ఎమ్మెల్యే సుజనాచౌదరి తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.



కుంకుమార్చన అనంతరం నక్షత్ర హారతి

పంట రుణాలు రీ షెడ్యూలు

రెండేళ్లలోపు వడ్డీ లేకుండా చెల్లించేలా వెసులుబాటు

గడువు మీరని వాటికే వర్తింపు • కలెక్టర్ బాలాజీ వెల్లడి


మచిలీపట్నం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో కురిసిన భారీ వర్షాలు, వరదలతో పంటలను కోల్పోయిన రైతులకు పంట రుణాలను రీ షెడ్యూల్ చేసుకునేలా ప్రభుత్వం అవకాశం కల్పించింది. తీసుకున్న రుణాలను వడ్డీ లేకుండా రెండు సంవత్సరాల లోపు చెల్లించేలా వెసులుబాటు ఇచ్చింది. గడువు మీరని పంట రుణాలకు మాత్రమే రీషెడ్యూల్ వర్తిస్తుందని స్పష్టం చేసింది. ఈ మేరకు కలెక్టర్ బాలాజీ బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. పంట రుణాలు తీసుకున్న రైతులు బ్యాంకు అధికారులను సంప్రదించి రుణాలను రీ షెడ్యూల్ చేసుకోవచ్చునని పేర్కొన్నారు. బ్యాంకర్లు సైతం రైతులకు సహకరించాలని సూచించారు. పంటలు నష్టపోయిన రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రూ.కోటిన్నర ఇసుక దోచేశారు

రాత్రికిరాత్రే మార్కెట్ యార్డు, కొండపల్లి వెంచర్‌లోని ఇసుక మాయం

ఇసుకే బంగారమైన వేళ నిత్యం ఒకరినొకరు తిట్టుకునే అధికార, ప్రతిపక్ష పార్టీల నేతలు కుమ్మక్కై కోటిన్నర రూపాయల ఇసుకను దోచేశారు. మార్కెట్ యార్డు, కొండపల్లి రియల్ ఎస్టేట్ వెంచర్‌లో ప్రభుత్వం నిల్వ చేసిన గుట్టలను రాత్రికిరాత్రే ఖాళీ చేసి సొమ్ము చేసుకున్నారు. అడ్డుకున్న రెవెన్యూ ఉద్యోగిని బెదిరించారు. చర్యలు తీసుకోవాల్సిన జిల్లా అధికారులు పట్టనట్లు వ్యవహరించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

- మచిలీపట్నం, పెడన ప్రాంతాల్లో విక్రయం
- అడ్డుకున్న రెవెన్యూ ఉద్యోగికి బెదిరింపులు
- అధికార, ప్రతిపక్ష పార్టీల నేతలు కుమ్మక్కై ఇసుక దోపిడీ





నాడు మచిలీపట్నం మార్కెట్ యార్డులో నిల్వ ఉన్న ఇసుక (ఇన్‌సెట్‌లో) నేడు ఖాళీగా మచిలీపట్నం మార్కెట్ యార్డు

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : జిల్లాలో ఇసుక కొరత వేధిస్తోంది. కృష్ణానదికి వరదలు రావడం, ప్రభుత్వ ఆంక్షల నేపథ్యంలో ఇసుక రీచ్‌ల నుంచి తీసేందుకు అవకాశం లేదు. గతంలో నదీ తీరం వెంబడి ఉన్న స్టాక్ పాయింట్లలో ఉన్న ఇసుక నిల్వలను అప్పటి వైసీపీ పెద్దలు ఖాళీచేశారు. అదే ఒరవడిని కొనసాగిస్తూ మచిలీపట్నం శివారు చిలకలపూడి రైల్వేస్టేషన్ సమీపంలోని కొండపల్లి రియల్‌ఎస్టేట్ వెంచర్, మచిలీపట్నం మార్కెట్‌యార్డులో నిల్వ ఉంచిన ఇసుకను కొందరు రాజకీయ నేతలు గుట్టుచప్పుడు కాకుండా తరలించుకుపోయారు.

పోలీస్ గస్తీ ఉన్నా తరలించేశారు..

మచిలీపట్నం మార్కెట్ యార్డు నగర శివారున ఉంది. ఇక్కడ ఎన్నికల కౌంటింగ్ అనంతరం ఈవీఎంలను భద్రపరిచే గూడౌన్‌లు, ఇతరత్రా సరుకులను నిల్వ ఉంచుతారు. వైసీపీ ప్రభుత్వంలో మార్కెట్ యార్డులోని గూడౌన్‌ల మధ్య ఉన్న స్థలంలో వందలాది లారీల ఇసుకను గుట్టలుగా పోసి నిల్వ ఉంచారు. ఇక్కడ ఈవీఎం గూడౌన్‌ల భద్రత కోసం నిత్యం ప్రత్యేక పోలీస్ బందోబస్తు ఉంటుంది. కొంత కాలంగా మార్కెట్ యార్డులో ఉన్న ఇసుక గుట్టలను ఎవ్వరూ పట్టించుకోలేదు. ఇటీవల అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకులు, ఇసుక వ్యాపారులు ఈ ఇసుక గుట్టలపై కన్నేశారు. అందరూ కూడబలుక్కుని ఇసుకను అక్రమంగా తరలించేందుకు పథకం రచించారు. అధికారపార్టీ నాయకుల అండదండలు తమకున్నాయని వ్యూహాత్మకంగా కొంతకాలం పాటు ప్రచారం చేసుకున్నారు. వారం రోజుల కిందట మార్కెట్ యార్డులోని ఇసుకను అర్ధరాత్రి సమయంలో గుట్టు చప్పుడుకాకుండా మచిలీపట్నం, పెడన ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకున్నారు. రెండు రోజుల్లో రూ.కోటిన్నర ఇసుక ఖాళీచేసేశారు. ఒక్కో టిప్పరు ఇసుకను రూ.45 వేల నుంచి 50వేల వరకు విక్రయించడం గమనార్హం.

అడ్డుకున్న సిబ్బందికి బెదిరింపులు

మచిలీపట్నం మార్కెట్ యార్డులో అర్ధరాత్రి ఇసుకను అక్రమంగా టిప్పర్లు, ట్రాక్టర్లలో తరలిస్తున్నారనే సమాచారంతో వీఆర్వో ఒకరు అక్కడకు వెళ్లి వీడియోలు, ఫొటోలు తీసి తహసీల్దార్, రెవెన్యూ డివిజన్ స్థాయి అధికారికి సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. ఈ క్రమంలో 'తాము జిల్లాలోని కీలక ప్రజాప్రతినిధి వద్ద పనిచేస్తున్నాం.. ఇసుక తరలింపును అడ్డుకోవద్దు.. అక్కడి నుంచి వెళ్లిపోవాలి' అంటూ సదరు వీఆర్వోకు ఫోన్‌లో కొందరు బెదిరింపులకు దిగినట్లు సమాచారం. ఏమైనా ఉంటే ఉదయం మాట్లాడుకుందామని చెప్పడంతో ఇదే విషయాన్ని సదరు వీఆర్వో రెవెన్యూ అధికారులకు తెలపగా, రాత్రివేళ మీరు అక్కడకు ఎందుకు వెళ్లారు.. తిరిగి వచ్చేయాలని చెప్పడంతో వీఆర్వో వెనుదిరిగి వెళ్లిపోయినట్లు తెలిసింది.

జేసీబీలతో లోడ్ చేసి మరీ..

చిలకలపూడి రైల్వేస్టేషన్ సమీపంలోని కొండపల్లి రియల్ ఎస్టేట్ వెంచర్‌లో అధికారులు ఇసుకను గతంలో నిల్వ ఉంచారు. పేదలు పక్కా గృహాల నిర్మాణం చేసుకుంటూ ఇసుక కావాలని అడిగితే గృహ నిర్మాణ శాఖ ద్వారా ఇక్కడి నుంచి ఇసుకను ఇచ్చేవారు. ఇటీవల కాలంలో ఈ ఇసుకపై కన్నేసిన కొందరు నేతలు రాత్రి వేళ టిప్పర్లు, ట్రాక్టర్లను ఏర్పాటు చేసి జేసీబీలతో ఇసుకను లోడ్‌చేసి సమీప గ్రామాల్లో అమ్ముకున్నారు. ఈ విషయం తెలిసి అన్ని పార్టీలవారు ఇక్కడికి వచ్చి ఇసుకను ట్రాక్టర్లలో లోడ్ చేసుకుని మరీ తీసుకుపోవడం గమనార్హం. పెద్ద ఎత్తున ఇసుకను తరలించుకుపోయినా అధికారులు అటు వైపు కన్నెత్తి చూడకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.

ఏమా వెండి కథ

ఆర్టీసీ బస్సులో అక్రమంగా వెండి రవాణా

- పెడన నుంచి విశాఖకు 25 కేజీలు సరఫరా
- ఎలాంటి బిల్లులు లేని వెండిని పట్టుకున్న స్క్వాడ్
- తిరిగి పార్టీకి అప్పగించేసిన అధికారులు
- కేసు పెట్టకుండా అప్పగించడంపై అనేక ఆరోపణలు

6లో

మంగళవారం నాటి ఆదాయం
రూ.69.02లక్షలు

వన్‌టౌన్ : ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మవారి దసరా మహోత్సవాలు మంగళవారం నాటికి ఆరు రోజులు ముగిశాయి. మంగళవారం శ్రీమహాలక్ష్మీదేవి అలంకారంలో దుర్గమ్మ దర్శనం ఇచ్చారు. ఈ సందర్భంగా రూ.500 టిక్కెట్ల ద్వారా రూ.28,95,500, రూ.300 టిక్కెట్ ద్వారా రూ.7,05,300, రూ.100 టిక్కెట్ ద్వారా రూ.5,56,900 ఆదాయం సమకూరింది. 35,018 లడ్డూల ద్వారా రూ.5,25,270, ఆరు లడ్డూలు ప్యాకెట్ల ద్వారా రూ.20,02,200లు ఆదాయం సమకూరింది. పరోక్ష ప్రత్యేక కుంకుమార్చన రూ.3000 టికెట్ ద్వారా రూ.60వేలు, రూ.5000 టికెట్ ద్వారా రూ.30వేలు, పరోక్ష ప్రత్యేక చండీహోమం రూ.4వేల టికెట్ ద్వారా రూ.40వేలు, పత్యేక ఖడ్గమాల టిక్కెట్ ద్వారా రూ.5,116లు, పబ్లికేషన్‌లు, ఫోటోలు, క్యాలెండర్ల ద్వారా రూ.5,112లు ఆదాయం సమకూరింది. తలనీలాల సమర్పణ రుసుము రూ.40 టిక్కెట్ ద్వారా రూ.77,560లు ఆదాయం వచ్చింది. మొత్తంగా కనకదుర్గమ్మవారికి రూ.69,02,958లు ఆదాయం సమకూరింది.







» ఫొటో ప్రదర్శనను తిలకిస్తున్న సీఎం చంద్రబాబు



» భక్తులతో ముచ్చటిస్తున్న హోంమంత్రి అనిత



» కొండపై సాంస్కృతిక సందడి..



» దుర్గగుడి ప్రాంగణంలో పోలీసు జాగిలంతో తనిఖీలు

మూలా నక్షత్రం.. క్యూలు కిటకిట

- అర్ధరాత్రి నుంచే అమ్మ దర్శన భాగ్యం
- ఫలించిన ముందస్తు ప్రణాళికలు
- శాఖలన్నీ సమన్వయం.. పదేళ్లలో మంచి ఫలితం
- ఏర్పాట్లు బాగున్నాయని సీఎం కితాబు



సరస్వతీదేవి దర్శనానికి బారులుతీరిన భక్తులు



చదువుల తల్లికి వందనం..



సరస్వతీదేవి అలంకారంలో దుర్గమ్మను దర్శించుకుంటున్న భక్తజనం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ/వన్‌టౌన్) : శరన్నవ రాత్రి మహోత్సవాలలో అత్యంత కీలకమైన మూలా నక్షత్రం నాడు ఎలాంటి వివాదాలు, ఆటంకాలు లేకుండా భక్తులు దుర్గమ్మను సరస్వతీ అలంకారంలో దర్శించుకున్నారు. ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం ముందస్తు ప్రణాళిక, పోలీసు, రెవెన్యూ, దేవదాయశాఖల మధ్య సమన్వయం కారణంగా సామాన్య భక్తులు సైతం తమకు అసౌకర్యం కలిగిందని ఎక్కడా ఫిర్యాదులు రాకపోవడం విశేషం. మూలానక్షత్రం నాడు అన్ని టిక్కెట్ దర్శనాలను ఉచితం చేశారు. లక్షల్లో అమ్మవారిని దర్శించుకోవటానికి వచ్చిన భక్తులను దృష్టిలో ఉంచుకుని ముందస్తు ప్రణాళికలు రూపొందించటంలో.. క్యూలైన్ల క్రమబద్ధీకరణలో అన్ని శాఖలు విజయం సాధించాయి.

అర్ధరాత్రి నుంచే భారీగా భక్తులు..

అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు మంగళవారం అర్ధరాత్రి నుంచే భారీగా తరలివచ్చారు. అర్ధరాత్రి నుంచి ఉదయం వరకు అసాధారణంగా దర్శనాలు జరిగాయి. భక్తుల రద్దీ దృష్ట్యా వ్యవస్థలన్నీ ఏమాత్రం ఏమరపాటుగా లేకుండా వ్యవహరించడంతో ఎక్కడా ఇబ్బందులు తలెత్తలేదు. కార్పొరేషన్ దగ్గర నుంచి కంటెయినింగ్ జోన్లను ఏర్పాటు చేశారు. అర్ధరాత్రి 12 గంటల సమయంలో భక్తులను ఈ ప్రాంతంలో హోల్డింగ్ చేశారు. ఆ తర్వాత క్యూలైన్లలోకి పంపారు. క్యూలలో తొక్కిసలాటను నివారించటానికి వీలుగా రోపులతో నిర్ణీత దూరం వరకు భక్తులను హోల్డ్ చేశారు. ఇలా రోజంతా హోల్డ్ చేయటం వల్ల ఎక్కడా తొక్కిసలాటకు అవకాశం ఇవ్వలేదు. మూలా నక్షత్రం రోజున గతంలో అమ్మవారి దర్శనానికి నాలుగు గంటలకు పైగా సమయం పట్టేది. ఈ ఏడాది అనధికార దర్శనాలను పూర్తిగా నియంత్రించటంవల్ల కేవలం గంటన్నర వ్యవధిలోనే భక్తులు అమ్మ దర్శనం చేసుకున్నారు. క్యూలలో ఎలాంటి అసౌకర్యాలు కలగలేదు. భక్తుల డిమాండ్‌కు అనుగుణంగా మంచినీళ్ల ప్యాకెట్లను సిద్ధం చేశారు. లడ్డూ ప్రసాదాలను ముందస్తుగా సిద్ధం చేసి పెట్టుకోవటం వల్ల ఎలాంటి కొరతా ఏర్పడలేదు. ఈసారి రూ. 100కి ఆరు లడ్డూల ప్యాకెట్లను అందుబాటులోకి తీసుకురావటంతో వీటిని పెద్ద సంఖ్యలో కొనుగోలు చేశారు. కొండ దిగువన భక్తులు కొబ్బరికాయలు కొట్టుకోవడానికి వీలుగా ఏర్పాట్లు ఉండటంతో స్వేచ్ఛగా పూర్తి చేసుకున్నారు. మూలా నక్షత్రం రోజున ఎలాంటి సమస్యలు లేకపోవడంతో దేవస్థాన అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. దీనికి తోడు వాతావరణం మేఘావృతంగా ఉండటంతో పాటు తుంపర చినుకులు పడటం వల్ల కూడా భక్తులు చల్లటి వాతావరణంలో దుర్గమ్మ దర్శనం చేసుకోగలిగారు. ఉదయం రెండు గంటల పాటు విపరీతమైన ఎండ వేసినా ఆ తర్వాత ఒక్కసారిగా నగరం మేఘావృతమైంది. ఓ భక్తురాలిపై పోలీసు అధికారి చేయిచేసుకోవటం తప్పితే ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోలేదు. అనధికారిక దర్శనాలను పూర్తిగా నిలువరించగలిగారు. దేవస్థాన సిబ్బంది కొంతమేర అనధికార దర్శనాలు చేయించే ప్రయత్నం చేసినా.. చాలావరకు పోలీసు, రెవెన్యూ యంత్రాంగం వాటిని సమర్థవంతంగా అడ్డుకోగలిగింది. దీంతో దసరా ఉత్సవాలు మూలా నక్షత్రం రోజున ప్రశాంతంగా జరిగాయి. ఘాట్ మార్గాలు, కొండ దిగువన కార్పొరేషన్ పారిశుధ్య సిబ్బంది సేవలు అందించారు. గతంలో మాదిరిగా చెప్పుల కుప్పలు కనిపించలేదు. దసరా ఉత్సవాలకు సంబంధించి జిల్లా యంత్రాంగం భక్తుల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకుంది. ఈ ఫీడ్ బ్యాక్‌లో భక్తులు సంతృప్తికరంగా సమాధానాలు ఇచ్చారు. సౌకర్యాలకు సంబంధించి మంచి ఫీడ్ బ్యాక్ వచ్చింది. అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించటానికి వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా ఫీడ్ బ్యాక్ వివరాలను ప్రకటించి చాలా సంతృప్తిగా ఉందని చెప్పారు. మూలానక్షత్రం రోజున భక్తుల ఫీడ్ బ్యాక్ చూస్తే క్యూలైన్ల పరంగా ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగితే 85 శాతం మేర సంతృప్తిగా ఉందని భక్తులు సమాధానం ఇచ్చారు. ఆలయ అలంకరణ ఏర్పాట్లకు సంబంధించి 92 శాతం ఫీడ్‌బ్యాక్ వచ్చింది. పారిశుధ్యానికి సంబంధించి 87 శాతం, మంచినీటి బాటిళ్లు - వాటర్ ప్యాకెట్ల పంపిణీకి సంబంధించి 95 శాతం, ఉభయ దాతల పూజలకు సంబంధించి 94శాతం, వృద్ధులు - వికలాంగుల సేవలకు సంబంధించి 94శాతం లడ్డూ ప్రసాదాలకు సంబంధించి 93 శాతం, కేశఖండన సేవలకు సంబంధించి అత్యధికంగా 96శాతం మేర భక్తులు ఫీడ్‌బ్యాక్ ఇచ్చారు.

పల్లకీలో ఊరేగిన ఆది దంపతులు..

లబ్బీపేట: వేలాది భక్తజనం మధ్య ఆదిదంపతులు పల్లకిలో ఊరేగుతూ దర్శనమిచ్చారు. లక్షలాదిగా భక్తులు క్యూ నుంచే నగరోత్సవాన్ని కన్నుల పండువగా తిలకించారు. కనకదుర్గానగర్ నుంచి ఘాట్‌రోడ్ మీదుగా ఊరేగింపు ఉత్సవం దేవస్థానంకు చేరుకుంది. దుర్గఘాట్‌లో కృష్ణమ్మ హారతులు చూసి భక్తులు తరించారు. మూల నక్షత్రం కావడంతో భారీగా విచ్చిన భక్తులు కృష్ణమ్మ హారతులను తిలకించి పులకించారు.

ఏమో వెండి కథ!

- ఆర్టీసీ బస్సులో అక్రమంగా రవాణా
- పెడన నుంచి విశాఖకు 25 కేజీలు సరఫరా
- ఎలాంటి బిల్లులు లేని వెండిని పట్టుకున్న స్క్వాడ్
- తిరిగి పార్టీకి అప్పగించేసిన అధికారులు
- కేసు పెట్టకుండా అప్పగించడంపై అనేక ఆరోపణలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : కార్గో ముసుగులో ఆర్టీసీ బస్సుల్లో అక్రమంగా వెండి రవాణా అవుతుండటం కలకలం రేపుతోంది. గత నెలలో బందరు నుంచి విశాఖపట్నం వెళ్లే బస్సులో అక్రమంగా 25 కేజీల వెండి పట్టుబడటం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీనిపై ఎలాంటి కేసు నమోదు చేయకుండా సీజ్ చేసిన వెండిని సదరు యజమానికి అప్పగించేయడంతో స్క్వాడ్ అధికారులు, వెండి యజమానులు కుమ్మక్కయ్యారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. సెప్టెంబరు 28న మచిలీపట్నం-విశాఖ ఆర్టీసీ బస్సులో పెడన వద్ద ఎలాంటి బిల్లులు లేని 25 కేజీల వెండిని అక్రమంగా లోడ్ చేశారు. దీనిపై సమాచారం అందుకున్న రీజనల్ స్క్వాడ్ బృందం అదేబస్సులో విశాఖ వరకు వెళ్లింది. విశాఖలో సరుకు దింపుతుండగా, స్క్వాడ్ అధికారులు బిల్లులు లేని వెండిని సీజ్ చేశారు. ఇక్కడి నుంచే కథ మలుపు తిరిగింది. వెండి సీజ్ విషయం తెలుసుకున్న యజమానులు విశాఖ వచ్చారు. ఏం జరిగిందో తెలియదు కానీ.. సీజ్ చేసిన వెండిని స్క్వాడ్ అధికారులు వారికి అప్పగించేశారు. సాధారణంగా సీజ్‌చేసిన వాటిని స్థానిక స్టేషన్‌కు తీసుకెళ్లి కేసుపెట్టాలి. లేదంటే.. మచిలీపట్నం బస్ డిపోలోనైనా అప్పగించాలి. ఇవేమీ చేయకుండా సదరు వెండిని యజమానులకు అప్పగించేయడం వెనుక కథ ఏమిటన్న ఆరోపణలు వస్తున్నాయి.

రహస్యంగా..

ఆర్టీసీలో విజిలెన్స్ విభాగం ఎంతగా నిద్రపోతోందో ఈ సంఘటన ద్వారా తెలుస్తున్నది. ఎలాంటి బిల్లులు లేకుండా రవాణా చేస్తే వాణిజ్య పన్నుల శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లాలి. ఆ పనీ చేయలేదు. బిల్లుల్లేని వెండిని కార్గోలో అధికారికంగా బుకింగ్ చేయలేదు. కేవలం డ్రైవర్‌కు ఇస్తే ఆయన తన సీటు కింద పెట్టుకుని రవాణా చేయటం గమనార్హం. ఈ బస్సులో ఇద్దరు డ్రైవర్లు ఉన్నారు. ఇద్దరికీ వెండి రవాణా విషయం తెలుసు. సాధారణంగా అయితే, ఆ ఇద్దరు డ్రైవర్లకు చెకింగ్ స్క్వాడ్ అధికారులు చార్జిమెమోలు ఇవ్వాలి. ఎస్ఆర్‌లో నమోదు చేయాలి. కానీ, ఈ వ్యవహారంలో మాత్రం స్క్వాడ్ అధికారులు రహస్యంగా ఉండిపోయారు.

విజిలెన్స్ దృష్టి సారించేనా..?

మచిలీపట్నం-విశాఖపట్నం బస్సుల్లో తరచూ వెండి, బంగారం అనధికారికంగా రవాణా అవుతోందన్న విమర్శలు ఎప్పటినుంచో వస్తున్నాయి. అయితే కొందరు అధికారులు దీనిని తమ సొంత ప్రయోజనాల కోసం వాడుకుంటున్నారన్న విమర్శలు వస్తున్నాయి. పక్కా సమాచారంతో బస్సులో రీజనల్ స్క్వాడ్ విశాఖపట్నం వరకు ప్రయాణించింది. అక్కడ వెండిని పట్టుకుని సీజ్ చేసింది. బిల్లులు లేని వెండిని పెడనలో కూడా పట్టుకోవచ్చు. అయినా యజమానులు ఎవరో తెలుసుకోవడానికి విశాఖపట్నం వరకు వెళ్లారు. అలాంటపుడు సదరు యజమానులపై కేసు నమోదు చేయకుండా రావడమే ఈ ఆరోపణలకు ప్రధాన కారణం. విజిలెన్స్ ఇప్పటికైనా ఈ అంశంపై దృష్టి సారిస్తుందో లేదా వేచి చూడాలి.

14న ఎక్సైజ్ దుకాణాల లాటరీకి ఏర్పాట్లు

- హిందూ పీజీ కళాశాలలో పరిశీలన

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 9 : ఈనెల 14న మద్యం దుకాణాల లాటరీకిగాను మచిలీపట్నం హిందూ పీజీ కళాశాలలో ఏర్పాట్లు చేస్తున్నారు. బ్యాంకులకు సెలవులు వచ్చినందున ఈనెల 11వ తేదీ రాత్రి 7 గంటల వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఈ నేపథ్యంలో 14వ తేదీన దుకాణాల లాటరీ తీసేందుకు హిందూ కళాశాల ప్రాంగణాన్ని ఎక్సైజ్ సూపరింటెండెంట్ జి.గంగాధరరావు, ఎక్సైజ్ అధికారులు భార్గవ్, ఎస్.నిక్సన్, ఆర్డీవో స్వాతి, తహసీల్దార్ పి.మధుసూధనరావు, ఆర్‌ఐలు శేఖర్, శ్యామ్‌లు పరిశీలించారు. హిందూ కళాశాల అనుబంధ సంస్థల చైర్మన్ కొనకళ్ల నారాయణ, పద్మావతి పీజీ కళాశాల ప్రిన్సిపాల్‌తో ఏర్పాట్లపై ఎక్సైజ్, రెవెన్యూ అధికారులు చర్చలు జరిపారు.

పంచాయతీలు బలోపేతం కావాలి

- ఇంటిపన్నుల బకాయిలు వసూలు చేయండి
- కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ



సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణా కలెక్టర్ బాలాజీ, హాజరైన అధికారులు

మచిలీపట్నం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు అధికారులు కృషిచేయాలని కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ అన్నారు. 'పీఆర్ వన్-విజిబుల్ ఎస్సెట్స్' అంశంపై జిల్లాపరిషత్ కన్వెన్షన్‌హాలులో ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు బుధవారం ఒకరోజు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రాజ్యాంగబద్ధంగా ఏర్పడిన పంచాయతీ రాజ్ వ్యవస్థను రానున్నరోజుల్లో మరింతగా బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. స్థానిక వనరులను ఉపయోగించుకుని అభివృద్ధి పనులు చేయాలన్నారు. ఇంటిపన్నుల వసూలును నూరుశాతం చేస్తే ఆదాయం సమకూరుతుందన్నారు. దీర్ఘకాలంగా ఇంటిపన్నులు చెల్లించని వారి జాబితాలను తయారుచేసి తొలివిడతగా వారినుంచి బకాయిలు వసూలు చేయాలన్నారు. పురపాలకసంఘాలలో ఇంటిపన్ను సకాలంలో కట్టకుంటే కంప్యూటర్‌ద్వారా వడ్డీవేసే వెసులుబాటు ఉంటుందని, దీంతో పురపాలకసంఘాలలో ఇంటిపన్నులు అధికశాతం వసూలు అవుతాయన్నారు. పంచాయతీలలోనూ ఈ విధానాన్ని అమలులోకి తీసుకువచ్చే ఆలోచన ప్రభుత్వం చేస్తోందన్నారు. పంచాయతీలలో ఇంటిపన్నుల రూపంలో వసూలైన నగదును సిబ్బంది జీతాలు, నిర్వహణ పనులకు ఉపయోగించి, మిగిలిన నగదును విజిబుల్ ఎస్సెట్స్‌కు కేటాయించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీచేసిందని తెలిపారు. గతనెల 23న జిల్లావ్యాప్తంగా పంచాయతీలలో సమావేశాలు నిర్వహించి ఏయే పనులు చేయాలో జాబితాలు తయారుచేశారని, ఆ పనులను ప్రాధాన్యతా క్రమంలో చేసేందుకు ప్రణాళికను రూపొందించాలని సూచించారు. ఈనెల 14నుంచి 21 వరకు నిర్వహించే పల్లెపండుగ-పంచాయతీ వారోత్సవాలను విజయవంతంగా నిర్వహించాలన్నారు. ఉపాధి పథకం ద్వారా ఆమోదం పొందిన పనులను ఈ వారోత్సవాలలో ప్రారంభించాలన్నారు. ప్రభుత్వం రూపొందించిన ప్రత్యేక యాప్‌లో ప్రారంభించిన పనులకు సంబంధించిన వివరాలు, ఫొటోలను అప్‌లోడ్ చేయాలన్నారు. పంచాయతీలలో సిమెంటు రహదారుల నిర్మాణాలకు ప్రణాళికను రూపొందించామని, రహదారులను నిర్మించిన తరువాత వాటిని నీటితో ఎంతమేర, ఎన్నిరోజులపాటు తడిపారనే అంశంపైనా, నాణ్యత ఎంతమేర పాటించారనే అంశంపైనా స్థానికులతో సంతకాలు తీసుకోవాలన్నారు. అధికారులు పనుల నాణ్యతను పరిశీలిస్తారని తెలిపారు. పంచాయతీలలో పనిచేసే పారిశుద్ధ్యకార్మికులకు సంబంధించిన మెడికల్ రిపోర్టులు పంచాయతీ కార్యదర్శి వద్ద, డీఎల్‌పీవోల వద్ద తప్పనిసరిగా ఉండాలన్నారు. ఎవరైనా కార్మికులు అనారోగ్యంగా ఉంటే వారికి వైద్యం చేయించాలన్నారు. ప్రజాసమస్యలపై స్థానికంగా వచ్చే అర్జీలను ప్రతిరోజు పరిశీలించి పరిష్కరించాలన్నారు. సమావేశంలో డీపీవో జె.అరుణ, జడ్పీ సీఈవో కె.కన్నమనాయుడు, ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

గుళ్లపల్లి జ్యోత్స్నకు ప్రముఖుల నివాళి



జ్యోత్స్న పార్థివదేహం వద్ద కుటుంబసభ్యుల నివాళి

విజయవాడ లీగల్, అక్టోబరు 9 : ప్రముఖ న్యాయవాది సుంకర రాజేంద్ర ప్రసాద్ సతీమణి, ఒకనాటి ఉద్యమ కార్యకర్త, నేటి తరుణీ తరంగాలు, సేఫ్ స్థాపనలో కీలక భూమిక వహించిన గుళ్లపల్లి జ్యోత్స్న (65) భౌతిక కాయాన్ని సీతారామపురంలోని ఆమె స్వగృహం వద్ద పలువురు ప్రముఖులు సందర్శించి నివాళులర్పించారు. మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి ఎ.సత్యానంద్, న్యాయమూర్తులు ఇందిర, నాగేశ్వరరావు, లక్ష్మి, శ్రీధర్, శ్రీదేవి, సీబీఐ కోర్టు న్యాయమూర్తి, మాజీమంత్రులు దేవినేని ఉమా, సీపీఎం నేతలు వి.శ్రీనివాసరావు, వై.వెంకటేశ్వరరావు, సీహెచ్ బాబురావు, దోనేపూడి కాశీనాథ్, పి.మధు, సీఐటీయూ రాష్ట్ర నేతలు వి.ఉమామహేశ్వరరావు, వైసీపీ నేత దేవినేని అవినాశ్, ఎమ్మెల్యేలు బోడె ప్రసాద్, గద్దె రామ్మోహన్, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి వీవీ శేషసాయి, ఎమ్మెల్సీ లక్ష్మణరావు, ఐద్వా నాయకులు కాట్రగడ్డ స్వరూపరాణి, పి.రమాదేవి, చొప్పరపు శ్రీదేవి, కె.సరోజ, సీపీఐ నాయకులు అక్కినేని వనజ, జి.కోటేశ్వరరావు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, బార్ కౌన్సిల్ చైర్మన్ ద్వారకానాథ్ రెడ్డి, వైస్ చైర్మన్ కృష్ణమోహన్, బార్‌కౌన్సిల్ సభ్యులు చలసాని అజయ్‌కుమార్, ఎస్.మల్లేశ్వరరావు, ముప్పాళ్ల సుబ్బారావు, వీవీ కృష్ణారెడ్డి, బార్ కౌన్సిల్ మాజీ చైర్మన్ ఘంటా రామారావు, హైకోర్టు బార్ ప్రెసిడెంట్ కె.చిదంబరం, బెజవాడ బార్ మాజీ అధ్యక్షులు చేకూరి శ్రీపతి, కిలారు బెనర్జీ, భావన్నారాయణ, చోడిశెట్టి మన్మథరావు, ప్రముఖ పారిశ్రామికవేత్త కోగంటి సత్యం, నగర ప్రముఖులు చలువాది మల్లిఖార్జునరావు, అమరావతి జేఏసీ నాయకులు సుధాకర్, యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు, టీడీపీ, వైసీపీ, బీజేపీ లీగల్‌సెల్ న్యాయవాదులు, ఐఏఎల్ నాయకులు షరీఫ్, సుధాకరరెడ్డి, కార్పొరేటర్‌లు చెన్నుపాటి ఉషారాణి, కుక్కల అనిత, విజయవాడలోని పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, న్యాయస్థాన సిబ్బంది, ఖమ్మం, నెల్లూరు, పశ్చిమగోదావరి, గుంటూరు తదితర జిల్లాల్లోని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి నల్లూరి మాధవరావు, ఐలూ తెలంగాణా రాష్ట్ర అధ్యక్షులు కొల్లి సత్యనారాయణ, ఉభయ రాష్ట్రాల్లోని ఐలూ నాయకులు, సేఫ్ ఆర్గనైజేషన్ నాయకులు, కార్యకర్తలు, స్వర్గీయ జ్యోత్స్నతో ఉద్యమ సాన్నిహిత్యం వున్న అనేకమంది ప్రజలు, నాయకులు పాల్గొని నివాళులర్పించారు. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ గోపాల గౌడ ఫోన్‌లో సుంకర రాజేంద్రప్రసాద్‌ను పరామర్శించారు. ఐలూ నాయకులు సంపర శ్రీను, ఆలూరు సుధాకరరావు, వేము కోటేశ్వరరావు, సప్పా రమేష్, వి.రాజారత్నం, సీవీ సుబ్రమణ్యేశ్వరరావు తదితరులు జ్యోత్స్న పార్థివదేహానికి ఘనంగా నివాళులర్పించారు. గురువారం మధ్యాహ్నం 3 గంటలకు జ్యోత్స్న పార్థీవదేహాన్ని ఎన్ఆర్ఐ మెడికల్ కళాశాల విద్యార్థుల పరిశోధన నిమిత్తం అప్పగించడం జరుగుతుందని ఆమె భర్త సుంకర రాజేంద్రప్రసాద్ తెలిపారు.



నివాళులర్పిస్తున్న మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి ఎ.సత్యానంద్, వామపక్ష నేతలు వనజ, శ్రీనివాసరావు, సీహెచ్ బాబూరావు, ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, బోడె ప్రసాద్

న్యూస్ బాక్స్



మాట్లాడుతున్న ఎస్పీ గంగాధర్

రూ.20 లక్షల విలువైన వాహనాల స్వాధీనం

కంకిపాడు, అక్టోబరు 9 : జిల్లా వ్యాప్తంగా పలుచోట్ల చోరీకి గురైన ద్విచక్ర వాహనాలను భారీ మొత్తంలో స్వాధీన పరుచుకున్నట్టు ఎస్పీ గంగాధర్ తెలిపారు. స్థానిక స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ, పెదపారుపూడి మండలానికి చెందిన అప్పికట్ల రాజీవ్ అలియాస్ కేరి నుంచి సుమారు రూ. 20లక్షల విలువైన 38 ద్విచక్ర వాహనాలను స్వాధీన పరుచుకోవడం జరిగిందని తెలియజేశారు. కంకిపాడు, చల్లపల్లి, గుడివాడ రూరల్, గన్నవరం, తోట్లవల్లూరు, పామర్రు, ఉయ్యూరు తదితర మండలాల పరిధిలో వాహనాల చోరీకి గురయ్యాయన్నారు. తోట్లవల్లూరులో 7, ఉయ్యూరు టౌన్‌లో 8, కంకిపాడులో 7, చల్లపల్లిలో 3, గన్నవరం, గుడివాడ రూరల్‌లో ఒక్కొక్కటి స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. వాహన చోరీలు అరికట్టేందుకు జిల్లా వ్యాప్తంగా సుమారు 12వేల సీసీ కెమేరాలు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. కేసు విచారణలో పాల్గొన్న సీఐ మురళీకృష్ణ, ఎస్సై డి.సందీప్, సిబ్బందికి క్యాష్ అవార్డుతో పాటు సర్వీసు అవార్డును అందజేశారు. సమావేశంలో డీఎస్పీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విజయవాడ ఎన్‌ఏసీలో మద్యం షాపుల లాటరీ

విజయవాడ, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : మద్యం షాపుల లాటరీని తీసే వేదికను మార్పు చేసినట్టు ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసరావు తెలిపారు. విజయవాడ గురునానక్ కాలనీలో నాక్ (ఎన్‌ఏసీ) కల్యాణ మండపంలో లాటరీ తీస్తామని పేర్కొన్నారు. తొలుత తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో లాటరీ తీయాలని భావించారు. శరన్నవరాత్రుల కారణంగా ట్రాఫిక్ ఆంక్షలు ఉండటంతో గొల్లపూడిలోని స్వర్ణకన్వెన్షన్ హాల్‌కు మార్చారు. ప్రభుత్వం తాజాగా దరఖాస్తులు చేసుకోవడానికి గడువును పెంచింది. 14వ తేదీన లాటరీ తీయాలని ఉత్తర్వులు జారీ చేసింది. ఆ రోజున కన్వెన్షన్ సెంటర్ ఇతరులకు బుక్కవ్వడంతో మళ్లీ వేదికను మార్పు చేశారు. గురునానక్ కాలనీలోని నాక్ కల్యాణ మండపంలో షాపుల కేటాయింపునకు సంబంధించిన డ్రా తీస్తామని డీసీ వివరించారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	128, 137, 148
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 525

ఘనంగా అయ్యప్ప భజన



ఈడుపుగల్లు (కంకిపాడు), అక్టోబరు 9 : మండలంలోని ఈడుపుగల్లులో టీడీపీ యువ నాయకుడు పర్వతనేని రవి ఆధ్వర్యంలో అయ్యప్ప భజన భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. గ్రామానికి చెందిన అయ్యప్పలతో పాటు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన అయ్యప్పలు ఈ భజనలో పాల్గొన్నారు. పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్, సర్పంచ్ పందిపాటి ఇందిర, వీరపనేని వెంకటేశ్వరరావు, పందిపాటి సుధాకర్, దేవినేని అనీల్, మాధవరావు, కిలారు శ్రీను, అనుమోలు రామకృష్ణ, సుంకర శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ లైన్లపై పిడుగు

● జంక్షన్‌లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

హనుమాన్‌జంక్షన్, అక్టోబరు 9 : విద్యుత్ లైన్లపై పిడుగు పడడంతో బుధవారం హనుమాన్‌జంక్షన్‌లో నాలుగు గంటలు పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఉరుములు మెరుపులతో కొద్ది సేపు వర్షం కురిసింది. అసమయంలో డెల్టా షుగర్ ఫ్యాక్టరీ సమీపంలో హనుమాన్‌జంక్షన్‌కు సరఫరా అయ్యే విద్యుత్ లైన్ల మీద పిగుడు పడింది. శేరీనరసన్నపాలెం ఫీడర్, హనుమాన్ జంక్షన్ సెక్షన్‌కు సంబంధించి తీగలు దెబ్బతిన్నాయి. జంక్షన్ ఏఈ జి.వెంకట దుర్గాప్రసాద్ పర్యవేక్షణలో సిబ్బంది హుటాహుటిన మరమ్మతులు జరిపారు. దీంతో శేరీ నరసన్నపాలెం ఫీడర్ పరిధిలో ఉన ముందడుగు కాంప్లెక్సు, మురళీపురం, హనుమాన్‌జంక్షన్ టౌన్ ఏరియాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం ఆరున్నర గంటలు వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

బ్యాంకు మేనేజర్ల వేధింపులు ఆపాలి



ఉయ్యూరు నగర పంచాయతీ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

ఉయ్యూరు, అక్టోబరు 9 : తీసుకున్న లోన్ కట్టాలని టిడ్కో ఇళ్ల లబ్ధిదారులను బ్యాంకు మేనేజర్లు వేధించడం సబబుకాదని సీపీఎం ఉయ్యూరు పట్టణ కార్యదర్శి బి.రాజేశ్ అన్నారు. టిడ్కో ఇళ్ల లబ్ధిదారుల సమస్యలపై బుధవారం నగర పంచాయతీ కమిషనర్ పి.వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, టిడ్కో ఇళ్లకు బ్యాంకు నుంచి లబ్ధిదారులకు లోన్ ఇప్పించి ప్రభుత్వ ఖాతాకు జమ చేసుకున్న గత ప్రభుత్వం ఇళ్ల నిర్మాణం పూర్తిచేసి ఇప్పటి వరకు ఇవ్వలేదని లోన్ కట్టమం టే ఏలా కడతారని ఆందోళన వ్యక్తం చేశారు. ఐదో వార్డులో డ్రెయినేజీ వ్యవస్థ అధ్వానంగా ఉందని దోమల బెడదతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎస్. ప్రశాంతి, నాగమణి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రైతుబజార్ల ఘనత టీడీపీదే

ఎమ్మెల్యే బోడె ప్రసాద్



బందరు రోడ్డులో రైతుబజార్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

పెనమలూరు, అక్టోబరు 9 : దళారీ వ్యవస్థకు తావులేకుండా పంటలు పండించే రైతులే స్వయంగా తమ ఉత్పత్తులను రైతు బజార్లలో విక్రయించుకొనేందుకు రైతుబజార్లను ప్రారంభించిన ఘనత టీడీపీకే దక్కుతుందని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం కానూరు బందరు రోడ్డుపై వీఆర్ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల ఎదురు బందరుకాల్వ ఇరిగేషన్ స్థలంలో ఏర్పాటు చేసిన రైతు బజార్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రైతు బజార్లను వడ్డే శోభనాద్రీశ్వరరావు రాష్ట్ర మంత్రిగా ఉన్నపుడు రూపకల్పన చేసిన విషయాన్ని గుర్తు చేశారు. గతంలో కరోనా సమయంలో కళాశాల లోపల ఉన్న రైతుబజార్‌ను ఇప్పుడు ఇక్కడికి తరలిస్తున్నట్లు తెలి పారు. స్థానిక ప్రజలు ట్రాఫిక్‌కు ఎటువంటి ఇబ్బంది కలగకుండా రైతుబజార్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తాడిగడప మునిసిపల్ కమిషనర్ భవానీప్రసాద్, టీడీపీ నాయకులు అనుమోలు ప్రభాకరరావు, వెలగపూడి శంకరబాబు, మారుపూడి ధనకోటేశ్వరరావు, అంగిరేకుల మురళి, పీతా గోపీచంద్, నర్రా చంటి, రాంకుమార్, సాంబశివ, సాదిక్, మేడసాని రత్నకుమారి, బర్మా శ్రీనివాస్, చాణక్య, నాగుర్‌మీరా, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

కంకిపాడు : ప్రజలకు ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు అందుబాటులో ఉంటూ మెరుగైన పాలన అందించేందుకు కృషి చేయాలని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో పంచాయతీ ఉప సర్పంచులు, సభ్యులు, అధికారులకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రజలకు ప్రజా ప్రతినిధులతో పాటు ప్రభుత్వ అధికారులు అందు బాటులో ఉండాలన్నారు. చిన్న చిన్న కమీషన్లకు కక్కుర్తిపడి పంచాయతీ ఆదాయానికి గండి కొట్టద్దని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి, ఎంపీడీవో అనూష, తదితరులు పాల్గొన్నారు.

కొండముచ్చులు పట్టివేత

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]



కొండముచ్చులను అడవికి తరలిస్తున్న పంచాయతీ సిబ్బంది

ఉంగుటూరు, అక్టోబరు 9 : పెదఅవుటపల్లిలో విచ్చలవిడిగా సంచరిస్తూ దొరికిన వారిని గాయపరుస్తున్న కొండ ముచ్చుల బెడదను ఎట్టకేలకు పంచాయతీ అధికారులు విరగడ చేశారు. ఫారెస్ట్ అధికారులు అందుబాటులో లేక పోవడంతో విస్సన్నపేటనుంచి కొండముచ్చులను పట్టుకోవడంలో అనుభవశాలురైన 10మంది ప్రైవేటు వ్యక్తులను రప్పించి బోనులు, వలల ద్వారా ఎనిమిది కొండముచ్చులను పట్టించివేశారు. బ్రదర్ జోసఫ్ తంబి ఆలయానికి వెళుతున్న నాగదేశి లోకాస్ అనే వృద్ధుడిపై ఇటీవల కొండముచ్చు దాడిచేసి తీవ్రంగా గాయపడ్డాడు. దీనిపై స్థానిక సీపీఎం నాయకులు పంచాయతీ అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ ఘటనపై సోమవారం ఆంధ్రజ్యోతిలో వార్త ప్రచురితం కాగా స్పందించిన పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బాణావతు తిరుపతమ్మ, నాని పాల్గొన్నారు.

ఉషారామాలో బతుకమ్మ కోలాటం



కళాశాల ప్రాంగణంలో విద్యార్థినుల బతుకమ్మ కోలాట నృత్య ప్రదర్శన

ఉంగుటూరు, అక్టోబరు 9 : తేలప్రోలు ఉషారామా ఇంజనీరింగ్ కళాశాలలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. కళాశాల ప్రాంగణంలో ప్రతిష్ఠించిన అమ్మవారికి మూలానక్షత్రం సందర్భంగా బుధవారం కళాశాల ఛైర్మన్ సుంకర రామబ్రహ్మం, ఉష దంపతులు పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థినులు వివిధరకాల పూలతో బతుకమ్మలను తయారు చేసి కళాశాల మైదానంలో తీర్చిదిద్దిన ముగ్గుల మధ్యలో వుంచి వాటి చుట్టూ తిరుగుతూ కోలాటం, నృత్య ప్రదర్శనలు చేస్తూ సందడి చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జీవీకేఎస్‌వీ ప్రసాద్, ఛైర్మన్ కుటుంబ సభ్యులు, బంధువులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్వేచ్ఛగా దరఖాస్తు చేసుకోండి

ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ వై. శ్రీనివాస చౌదరి



మాట్లాడుతున్న శ్రీనివాస చౌదరి

గన్నవరం, అక్టోబరు 9 : ఉమ్మడి కృష్ణాజిల్లాలో మద్యం దుకాణాలకు ప్రతి ఒక్కరు స్వేచ్ఛగా దరఖాస్తు చేసుకోవచ్చునని ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ వై.శ్రీనివాస చౌదరి అన్నారు. ఇప్పటి వరకూ ఉమ్మడి కృష్ణాజిల్లాలో 236 మద్యం దుకాణాలకు గాను 4,633 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ఎన్టీఆర్ జిల్లాలో 113, కృష్ణాజిల్లాలో 123 షాపులు ఉన్నాయన్నారు. గన్నవరం ఎక్సైజ్ స్టేషన్‌లో జరు గుతున్న మద్యం దుకాణాల దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను బుధవారం పరిశీలించారు. అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ యు.సుబ్బారావు, ఎక్సైజ్ సీఐ డి.సురేఖ పాల్గొన్నారు.

యోగా శిక్షకులకు ఆహ్వానం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, అక్టోబరు 9 : కానుమోలు ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రిలో పార్టుటైం యోగా శిక్షణ ఇచ్చేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డాక్టర్ వాహిని బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయుర్వేద ఆసుపత్రిలో పురుషులకు, స్త్రీలకు వేర్వేరుగా యోగా శిక్షణ ఇచ్చేందుకు పురుషుడు, స్త్రీ అవసరమని తెలిపారు. డిగ్రీ అర్హతతో పాటు యోగాలో అనుభవమున్నవారు అక్టోబరు 11వతేదీ ఉదయం సర్టిఫికెట్లతో హాజరు కావాలని తెలిపారు.

చదువులతల్లికి నీరాజనం



పేరంటాలమ్మకు పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు దంపతులు

ప్రసాదంపాడు, అక్టోబరు 9 : విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడులోని వెంకమ్మ పేరంటాలమ్మ దేవస్థానంలో శరన్న వరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. బుధవారం అమ్మవారి జన్మనక్షత్రమైన మూలనక్షత్రం రోజున సరస్వతీదేవీగా కొలువు దీరారు. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు దంపతులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఈవోప్రియాంక, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.

పెనమలూరు సెంటరులో..

పెనమలూరు : దేవీ నవరాత్రుల సందర్భంగా పెనమలూరు సెంటరు లో ఏర్పాటు చేసిన మండపంలోని అమ్మవారి విగ్రహం వద్ద ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ దసరా పండుగ నియోజక వర్గ ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలని ఆకాంక్షించారు.

కంకిపాడు శివాలయంలో..

కంకిపాడు : దసరా నవరాత్రి ఉత్సవాలను ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ఎమ్మెల్యే బోడెప్రసాద్ అన్నారు. కంకిపాడు శివాలయంలో 7వ రోజు మూలానక్షత్రం రోజున అమ్మ వారు భక్తులకు సరస్వతీదేవిగా దర్శనమిచ్చారు. బుధవారం ఉదయం కమ్మ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ తుమ్మల చంద్రశేఖ ర్‌తో కలిసి సరస్వతి అమ్మవారిని ఆయన దర్శనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ దివి రోహిణి, పులి శ్రీను, కమిటీ సభ్యులు కొండా నాగేశ్వరరావు, చలవాది రాజా, అడపా నాగశ్రీ, కుంటా గంగాధర్, పార్టీ నాయకులు షేక్ బాజి, కళ్యాణి, శివపార్వతి పాల్గొన్నారు.

సోమేశ్వరస్వామి ఆలయంలో..

ఉయ్యూరు : జగదాంబ సమేత సోమేశ్వరస్వామి ఆలయంతో పాటు చిన ఓగిరాల చింతలతోట దుర్గా మండపంలో సరస్వతిదేవిగా అలంకరించి చిన్నారులతో పూజలు చేయించారు. గండిగుంట గణపతి సచిదానంద జ్ఞానబోధ సభ, పెద ఓగిరాల, ఆకునూరు శివాలయాల్లో అమ్మవారికి పూజలు చేశారు.

● కాటూరులో జరుగుతున్న దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో దుర్గాదేవిని బుధవారం టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైవీబీ రాజేంద్ర ప్రసాద్ దర్శించి పూజలు చేశారు. పార్టీ సీనియర్ నాయకులు వేమూరి శ్రీనివాస రావు, కుప్పాల అంజిబాబు, కోడె హరీశ్, వీరమాచినేని ఉమా పూజలు చేశారు.

లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో..

ఉంగుటూరు : లంకపల్లి లక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రాంగణంలో ప్రతిష్ఠించిన అమ్మవారు పులివాహనంపై వీణాపాణిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు చదలవాడ శివనాగేశ్వరరావు, కుమారస్వామి విశేషపూజలు జరిపారు.

సరస్వతీదేవిగా రాజ్యలక్ష్మి

హనుమాన్‌జంక్షన్ : స్థానిక నూజివీడు రోడ్డులోని లక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో రాజ్యలక్ష్మి అమ్మవారిని శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మూలా నక్షత్రం పురస్కరించుకొని బుధవారం సరస్వతీదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రంగన్నగూడెంలో..

హనుమాన్‌జంక్షన్ రూరల్ : రంగన్నగూడెం, వీరవల్లి, రంగయ్యప్పారావుపేట, కొత్తపల్లి గ్రామాల్లో బుధవారం సరస్వతీదేవి అవతారంలోని అమ్మవారికి విద్యార్థులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రంగన్నగూడెంలో నిర్వహించిన పూజలో అట్లూరి ఉష విద్యార్థులకు పూజలో ఉంచిన పెన్నులు, పుస్తకాలను బహూకరించారు.

కోలవెన్నులో పశు వైద్యశిబిరం

కంకిపాడు, అక్టోబరు 9 : గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్న ఉచిత పశు వైద్య శిబిరాలను పశుపోషకులు సద్వినియోగ పరుచుకోవాలని కమ్మ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ తుమ్మల చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని కోలవెన్ను గ్రామంలో సొంత నిధులతో ఏర్పాటు చేసిన ఉచిత పశువైద్య శిబిరాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా తుమ్మల చంద్రశేఖర్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో పశుపోషకులు పూర్తిగా తగ్గిపోయారన్నారు. ఈ ఉచిత పశు వైద్య శిబిరంలో సుమారు 50 పశువులకు చికిత్స, 40 దూడలకు నట్టల నివారణ మం దులు ఇవ్వడం జరిగిందని జేడీవో నరసింహారావు తెలియజేశారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	128, 137, 148
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.525

విద్యుత్‌శాఖ విజిలెన్స్ దాడులు

నాగాయలంక, అక్టోబరు 9 : మండలంలో విద్యుత్‌శాఖ విజిలెన్స్ అధికారులు బుధవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. విజిలెన్స్ సూపరింటెండెంట్ అల్ఫాన్స్ ఆధ్వర్యంలో మొత్తం 29 బృందాలుగా ఏర్పడి 2191 గృహాలను, 177 వాణిజ్య దుకా ణాలను, 3 ఇతర సర్వీసులను తనిఖీ చేశారు. వాటిలో 255 అదనపు లోడుతో ఉన్న సర్వీసులను గుర్తించి రూ.7,12,800 జరిమానా విధించినట్లు నాగాయలంక ఏఈ జి.వెంక టరాజు తెలిపారు. కార్యక్రమంలో ఉయ్యూరు, అవనిగడ్డ అధికారులు పాల్గొన్నారు.


తనిఖీ చేస్తున్న అధికారులు


బందరు హిందూ హైస్కూల్లో సరస్వతీదేవికి పూజలు


చల్లపల్లి కన్యకా పరమేశ్వరి సరస్వతీదేవిగా


వేకనూరు అంకాలమ్మ..


గుడివాడలో..


కరెన్సీతో గంగానమ్మ..

అక్షర ప్రదాయినీ.. ఆశీర్వదించమ్మా

• మూలా నక్షత్రం సందర్భంగా సరస్వతీదేవి అలంకారంలో భక్తులకు దర్శనం • సామూహిక అక్షరాభ్యాసం, కుంకుమార్చనలు

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 9 : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా బుధవారం ఆలయాల్లో అమ్మవారిని సరస్వతీదేవిగా అలం కరించారు. రామలింగేశ్వరస్వామి, హిందూ హైస్కూలు ప్రాంగణంలోని సరస్వతీ దేవాలయం, రామానాయుడుపేటలో జ్ఞానసరస్వతీదేవి, బచ్చు పేట భ్రమరాంబా సమేత మల్లేశ్వరస్వామి, సర్కిల్‌పేట మల్లేశ్వరస్వామి ఆలయాల్లో సరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు సామూహిక కుంకుమార్చనలు చేశారు. దత్తాశ్రమంలో చండీహోమం. కన్యకాపరమేశ్వరి ఆలయంలో అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు.

చల్లపల్లిలో..

మూలా నక్షత్రం సందర్భంగా చల్లపల్లి కన్యకా పరమేశ్వరీ దేవాలయంలో, అన్నపూర్ణా సమేత కాశీవిశ్వేశ్వరస్వామి, లక్ష్మీపురంలోని దుర్గాపార్వతీసమేత సోమేశ్వరస్వామి ఆలయంలో విశేష పూజలు జరిగాయి. చిన్నారులతో ప్రత్యేక పూజలు, అక్షరాభ్యాసాలు జరిగాయి.

అవనిగడ్డలో..

గీతామందిరంలో సరస్వతీ అమ్మవారికి పంచామృతాలతో చిన్నారులు విశేష అభిషేకాలు నిర్వహించారు. సామూహికంగా అమ్మవారికి లక్ష కుంకుమార్చన, లక్ష్మీ సహస్ర నామ స్తోత్ర పారాయణ, సరస్వతీ సహస్ర నామ స్తోత్ర పారాయణం చేశారు.

వేకనూరులో...

అవనిగడ్డ రూరల్ : వేకనూరులోని అంకాలమ్మ, సరస్వతీదేవిగా భక్తు లకు దర్శనమిచ్చారు. మోదుమూడిలోని ఆదిశేష దేవస్థానంలో అమ్మవారు సరస్వతీ దేవి అలంకారంలో దర్శనమిచ్చారు.

మోపిదేవిలో..

మోపిదేవిలోని సకలేశ్వరస్వామి ఆలయంలో సరస్వతీ దేవి అమ్మవారి ఉపాలయంలో 225 మంది చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు.

కూచిపూడిలో..

కూచిపూడి రామలింగేశ్వరస్వామి దేవాలయంలో దేవదాయ, ధర్మదాయ శాఖ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ టి.మోహనరావు దంపతులు పాల్గొన్నారు. పాలకమండలి సభ్యులు, వేదపండితులు ఆలయ మర్యా దలతో స్వాగతం పలికి శేషవస్త్రాలు అందించారు. కూచిపూడి, చిన ముత్తేవి, మొవ్వ, పెదపూడి, అయ్యంకి, నిడుమోలు, కాజ, కోసూరు, పెడసనగల్లు, భట్లపెనుమర్రు, బార్లపూడి తదితర గ్రామాల్లోని అమ్మవారికి విశేష పూజలు, చక్రస్నానం, అభిషేకాలు నిర్వహించారు.

నాగాయలంకలో..

నాగాయలంకలో తలశిల వంశీయుల ఇలవేల్పు గంగానమ్మ తల్లిని రూ.లక్ష కరెన్సీ నోట్లతో ప్రత్యేకంగా అలంకరించారు. తలశిల సతీష్-హరీష దంపతులచే ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు.

చినఎరుకపాడులో..

గుడివాడ రూరల్: చిన ఎరుకపాడులో అష్టలక్ష్మీ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మోటూరు, చౌటపల్లి గ్రామాల్లోని దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

కుదరవల్లిలో..

నందివాడ : కుదరవల్లి శివాలయం వద్ద అమ్మవారిని సరస్వతీదేవిగా అలంకరించారు. మాజీ సర్పంచ్ మసిముక్కు వేణు ప్రత్యేక పూజలు నిర్వహించారు. విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు.

పెదపారుపూడిలో..

వానపాములలో రామలింగేశ్వరస్వామిఆలయంలోని పార్వతీదేవి, సరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

కోడూరులో..

కోడూరులోని కనకదుర్గమ్మ ఆలయం వద్ద, నరసింహాపురం రామా లయంలో అమ్మవారి జన్మనక్షత్రం కావటంతో విద్యార్థులు కుంకుమ పూజలు నిర్వహించారు. పిల్లలకు అక్షరాభ్యాసం చేశారు.

దావోజిపాలెంలో..

పెడన రూరల్ : దావోజిపాలెం విజయ అమలేశ్వరీదేవి ఆలయంలో అమ్మవారిని సరస్వతీ దేవిగా అలంకరించి పూజలు చేశారు. పెనుమల్లిలో శివనాగ దుర్గా , కూడూరు, నందమూరు పూజలు చేశారు.

పామర్రులో..

శివాలయంలో అమ్మవారిని, అంకమ్మతల్లి, వాసవీకన్యకాపరమేశ్వరి, సరస్వతీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. సరస్వతిదేవి అలం కారంలోని వాసవీమాతను ఎమ్మెల్యే వర్లకుమార్‌రాజా దర్శించుకున్నారు.

బంటుమిల్లిలో..

బంటుమిల్లి పద్మావతి గోదాదేవీ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో, పెదతుమ్మిడి పార్వతీసమేత అగస్త్యేశ్వరస్వామి, బంటుమిల్లి కనకదుర్గ, రామాలయంలో సరస్వతీదేవిని దర్శించుకుని పూజలు చేశారు.

పెడనలో..

వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవి ఆలయంలో అమ్మవారు సరస్వతీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆర్యవైశ్య సంఘ నేత కొల్లూరి చిన్నా బాలభోగం, సరస్వతీ హోమం, సామూహిక కుంకుమార్చన నిర్వ హించారు. పైడమ్మతల్లి దేవస్థానంలో ఈవో టి.వి.వి.మోహనరావు, వ్యవ స్థాపక ధర్మకర్త తోట రామారావుల పర్యవేక్షణలో అమ్మవారు సరస్వతీ దేవీ అలంకారంలో దర్శనమిచ్చారు. ఆరేపల్లి సోమశేఖర్, గంగా భవానీ దంపతులు ఉభయదాతలుగా వ్యవహరించారు. గంగా పార్వతీ సమేత అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో మెట్ల కనకవెంకట సుబ్రహ్మణ్య సురేష్, వసంత దంపతులు పార్వతీ దేవికి వెండి కవచాన్ని సమర్పించారు.

గూడూరులో..

తరకటూరులో కనకదుర్గమ్మను టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూరగడ్డ వేదవ్యాస్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గుడ్లవల్లేరులో..

వేమవరం కొండాలమ్మ, సరస్వతీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. సరస్వతీ మూలమంత్ర హననం, హోమం నిర్వహించారు. విద్యార్థులు అమ్మవార్ని దర్శించుకుని, సామూహిక సరస్వతీ పూజలో పాల్గొన్నారు. ఈవో కొండలరావు పాల్గొన్నారు.

పెదపారుపూడి : వెంట్రప్రగడలో సరస్వతీదేవికి ప్రత్యేక పూజలు చేశారు. పూజల అనంతరం అన్నసమారాధన నిర్వహించారు.


వానపాములలో పిల్లలను విద్యాసామగ్రిని అందిస్తున్న అర్చకులు


మచిలీపట్నం జ్ఞాన సరస్వతీ ఆలయంలో సామూహిక కుంకుమార్చన


కూచిపూడిలో సరస్వతీదేవిగా..


గుడివాడలో చిన్నారితో అక్షరాభ్యాసం చేయిస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

చిన్నారులకు సరస్వతీదేవి ఆశీస్సులు

సామూహిక అక్షరాభ్యాసంలో ఎమ్మెల్యే వెనిగండ్ల

గుడివాడ, అక్టోబరు 9: సరస్వతీదేవి ఆశీస్సులతో చిన్నారులు చక్కటి విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆకాంక్షించారు. భీమేశ్వరస్వామి దేవస్థానంలో బుధవారం మూలా నక్షత్రం సందర్భంగా సరస్వతీదేవి పూజల్లో ఆయన పాల్గొన్నారు. ఎమ్మెల్యేకు ఆలయ మర్యాదలతో ఆలయ సిబ్బంది స్వాగతం పలికారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, మున్సిపల్ మాజీ ఛైర్మన్ యలవర్తి శ్రీనివాస రావు, జనసేన ఇన్‌చార్జి బూరగడ్డ శ్రీకాంత్, ఆలయ ఈవో కె.వి.గోపాలరావు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు. కన్యకాపరమేశ్వరీ దేవస్థానంలో సరస్వతీదేవి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. పూజా కార్యక్రమాల్లో ఆర్డీవో జి.బాలసుబ్రహ్మణ్యం, భక్తులు పాల్గొన్నారు.


పూర్ణాహుతితో పాల్గొన్న ఎమ్మెల్యే మండల బుద్ధప్రసాద్ దంపతులు

వైభవంగా చండీయాగం

అవనిగడ్డ : అవనిగడ్డలో లంకమ్మ ఆలయంలో అమ్మవారి భక్తబృందం నేతృత్వంలో చండీ యాగం నిర్వహించారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తనయుడు మండలి వెంకట్రామ్, అల్లుడు శీలం అశ్విన్ కుమార్, టీడీపీ నేత బండే రాఘవ సతీసమేతంగా యాగంలో పాల్గొన్నారు. బుద్ధప్రసాద్, విజయలక్ష్మి దంపతులు పూర్ణాహుతిని గావించారు. కార్యక్రమంలో ఈవో యార్లగడ్డ శ్రీనివాస్, భక్త బృందం ప్రతినిధి కూనపరెడ్డి దుర్గా వెంకట పరశురామ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

పంచాయతీ సభ్యులకు శిక్షణలో ఎంపీపీ దుర్గారాణి

మోపిదేవి, అక్టోబరు 9 : గ్రామాభివృద్ధిలో ప్రతీ ఒక్క పాలకవర్గ సభ్యుడు భాగస్వామి కావాలని ఎంపీపీ రావి దుర్గావాణి అన్నారు. మండల కార్యాలయంలో బుధవారం పంచాయతీ వార్డు సభ్యులకు పరిపాలన, ఆర్థిక అంశాల నిర్వహణపై రెండు రోజులపాటు రిగే శిక్షణా తరగతులను ఎంపీపీ ప్రారంభించారు. పంచాయతీలోని ప్రతి ఒక్క అంశంపై సభ్యుడు పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎంపీడీవో జె.స్వర్ణభారతి, ఈవోపీఆర్డీ కె.టి.సుందరి, ఉపసర్పంచ్‌లు పాల్గొన్నారు.

పెదపారుపూడిలో..

మండల కార్యాలయంలో పంచాయతీ పరిపాలనపై ఉపసర్పంచ్‌లకు, వార్డుసభ్యులకు అవగాహన సదస్సు నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఎంపీడీవో టి.సీతామహాలక్ష్మి మాట్లాడుతూ పంచాయతీల అభివృద్ధిలో తమ పాత్రను తప్పక పోషించా లన్నారు. శిక్షణా కార్యక్రమంలో ఐదు ప్రధాన అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈవోపీఆర్డీ వంగా శ్రీనివాస్, మాస్టర్ ట్రైనర్‌గా పంచా యతీ కార్యదర్శులు విజయ్ కుమార్, కృష్ణవేణి పాల్గొన్నారు.

పల్లె పండగకు సిద్ధంకండి

అధికారులతో సమీక్షలో ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా

పామర్రు, అక్టోబరు 9 : గ్రామ స్వరాజ్య స్థాపనే లక్ష్యంగా ప్రభుత్వం ఈనెల 14నుంచి నిర్వహించే పల్లె పండగను విజయవంతం చేయాలని అధికారులకు ఎమ్మెల్యే వర్లకుమార్‌రాజా సూచించారు. ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో బుధవారం పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. గత ఆగస్టులో గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభల్లో అభివృద్ధికి ఆమోదించిన పనులను పల్లెపండగ వారోత్సవాల్లో ప్రారంభించాలన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులతో కలసి రూట్ మ్యాప్ సిద్ధంగా ఉంచుకోవాలని ఆదేశించారు. సమావేశంలో టీడీపీ మండల అధ్యక్షుడు కుదరవల్లి ప్రవీణ్‌చంద్ర, అధికారులు పాల్గొన్నారు.


అధికార్లతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే వర్ల

సమస్యల పరిష్కారానికి చొరవ చూపండి

ఆర్టీసీ చైర్మన్ కొనకళ్లకు ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం వినతి

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 9 : ఐదేళ్లగా ఆర్టీసీ కార్మికులకు సరైన వైద్య సదుపాయాలు అందక ఇబ్బందులు పడుతున్నారని, సమస్యలను పరిష్కరించాలని ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి సురేష్‌బాబు కోరారు. ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావును సురేష్‌బాబు కలసి కార్మికుల సమస్యలను పరిష్కరించాలంటూ వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వంలో సంస్థను విలీనం చేసినా ఆశించిన ఫలితాలు అందలేదన్నారు.

సస్యరక్షణతో ఆశించిన దిగుబడులు సాధ్యం : ఏడీఏ

గుడివాడ రూరల్, అక్టోబరు 9 : సస్యరక్షణతో ఆశించిన దిగుబడులు సాధిం చవచ్చని ఏడీఏ నిమ్మగడ్డ రమాదేవి అన్నారు. ఏడీఏ కార్యాలయంలో బుధవారం నాగవరప్పాడు తదితర ప్రాంతాల రైతులతో అవగాహన సదస్సు నిర్వహించారు. చిరుపొట్ట దశలో ఉన్నందున రైతులు జాగ్రత్తగా ఉండాలన్నారు. ఏవో బోలెం అనంతలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

మోపిదేవిలో..

మండల వ్యవసాయ శాఖాధికారి హెబ్సిబా రాణి పెదకళ్లేపల్లిలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. వ్యవసాయశాఖ రైతులకు నూరుశాతం రాయితీపై ఎలుకల నివారణ మందు అందజేస్తుందన్నారు. ఆయకట్టు రైతులందరూ సామూహికంగా ఎలుకల నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. వైస్ ఎంపీపీ కడవకొల్లు సీతారామాంజనేయులు, అరజా కిరణ్ కాంత్, గోళ్ల సుబ్బారావు పాల్గొన్నారు.

పెందుర్రులో..

బంటుమిల్లి: పెందుర్రుపొలం పిలుస్తోంది కార్యక్రమంలో వరి సాగు పట్ల రైతులు తీసుకోవల్సిన జాగ్రత్తలు, సీజన్‌లో వచ్చే వ్యాధుల గురించి వివరించారు. కార్యక్రమంలో గౌతమ్, జి.శివరామకృష్ణ, శ్రీవాసరావు, రైతులు పాల్గొన్నారు.

అవనిగడ్డ ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యురాలిగా కృష్ణకుమారి

అవనిగడ్డ : నియోజకవర్గ జనసేన పార్టీ నాయకురాలు బచ్చు కృష్ణకుమారి అవనిగడ్డ ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యురాలిగా నియమించారు. జిల్లా అధికార ప్రతినిధి రాయపూడి వేణుగోపాలరావు, రాజనాల వీరబాబు, అన్నపరెడ్డి ఏసుబాబు, చందుబాబు తదితరులు ఆమెకు అభినందనలు తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యవసాయ కూలి మృతి

కోడూరు, అక్టోబరు 9 : జరుగువానిపాలెం గ్రామానికి చెందిన అప్పికట్ల పోతురాజు (48) చింత కోళ్ల గ్రామంలో రొయ్యల చెరువుల వద్ద గడ్డి కోసేందుకు కూలి పనికి వెళ్లాడు. గడ్డి కోసే సమ యంలో క్రమంలో కత్తికి విద్యుత్ వైర్ తగలడంతో విద్యుదాఘాతానికి గురయి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై కె.చాణిక్య తెలిపారు.

వీఆర్వో మృతి

బంటుమిల్లి: కంచడం వీఆర్వోగా పనిచేస్తూ ఏలూరు జిల్లా బదిలీ అయిన సి.హెచ్. నాంచారయ్య (46) బుధవారం తెల్లవారుజామున మృతి చెందాడు. సాధారణ బదిలీలో భాగంగా ఈనెల 8వ తేదీన ఏలూరు జిల్లాలో బాధ్యతలు స్వీకరించి స్వగ్రామమైన ముదినేపల్లి మండలంలోని అప్పారావుపేటకు చేరుకున్నారు. బుధవారం రక్తపువాంతులు కావడంతో ఆసుపత్రికి తరలిస్తుండగా మృతిచెందాడు. ఇతనికి భార్య, కొడుకు, కూతురు ఉన్నారు. బంటుమిల్లి తహసీల్దార్ భరత్‌రెడ్డి, డీటీ పూర్ణ, రెవెన్యూ సిబ్బంది నివాళులు అర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

చెల్లని చెక్కు కేసులో నిందితుడికి జైలు

మచిలీపట్నం: చెల్లనిచెక్కు కేసులో నేరంరుజువు కావడంతో నిందితునికి ఆరునెలల జైలుశిక్ష విధిస్తూ ఎక్సైజ్ కోర్టు న్యాయమూర్తి ఎన్.మేరీ బుధవారం తీర్పు చెప్పారు. మచిలీపట్నం రామానాయుడుపేటకు చెందిన గుగ్గిళ్ల శివనాగమురళీకృష్ణ, అదే ప్రాంతానికి చెందిన బేతపూడి మధుసూదనరావుకు 2017లో రూ.3 లక్షలు అప్పుగా ఇచ్చాడు. దానికి అతను చెక్కు అంద జేశాడు. బ్యాంకులో దానిని జమచేయగా అది బౌన్స్ అయింది. దీంతో బాధితుడు కోర్టును ఆశ్రయించాడు. రూ.3లక్షలు శివనాగమురళీకృష్ణకు చెల్లించాలని, నగదు చెల్లించకుంటే మరో మూడునెలలు జైలు శిక్ష అమలవుతుందని న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

కిడ్నీ బాధితుడికి పూర్వ విద్యార్థుల చేయూత

చల్లపల్లి: రెండు కిడ్నీలు దెబ్బతిని డయాలసిస్ చేయించుకుంటున్న సుభానీకి చల్లపల్లి రాజా కళాశాల పూర్వవిద్యార్థులు సామాజిక బాధ్యతతో తమవంతుగా సాయమందించారు. 1993-94 టెన్త్ బ్యాచ్ రూ.27వేలను సుభానీకి అందించారు. ఉప్పల గణపతి, చిన్ని, బెల్లంకొండ పోతురాజు, షేక్ సుభానీ, జంపాన కోటేశ్వరరావు, హేమశంకరప్రసాద్, ముబీజ్, బుజ్జి, రావెళ్ల రవికిరణ్, కొల్లి ఫణి పాల్గొన్నారు.